క్లుప్తంగా

మట్టి వినాయకుని తయారీ పోటీలు



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో వినయాక చవితిని పురస్కరిస్కురించుకొని విద్యార్థులకు శనివారం మట్టి వినాయక ప్రతిమలను తయారీకి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వాటికి వాడే రంగులు పర్యావరణానికి హానికరం అన్నారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయకుని బొమ్మలు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎం. ప్రభుదాస్, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ




నరసరావుపేట ఈస్ట్: జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవాలలో తమ విద్యార్థులు ఎస్.మధుషాలిని ఛాయ చిత్రప్రదర్శనలో ప్రథమ, ఫోక్ సాంగ్‌లో శాంతికుమారి ప్రథమ, వక్తృత్వంలో పి.శ్రీహరి ద్వితీయ బహుమతి సాధించి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని వివరించారు. విద్యార్థులను ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు, పీడీ ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైనది



చిలకలూరిపేటటౌన్: న్యాయవాద వృత్తి పవిత్రమైనదని అసిస్టెంట్ గవర్నమెంట్ మాజీ ప్లీడర్ దాసరి చిట్టిబాబు చెప్పారు. ప్రపంచ లా దినోత్సవం సందర్భంగా జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సీనియర్ నాయవ్యాది, మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి, సభ్యులు గేరా యాకోబు,పానుగుపాటి బుల్లిబాబు, జెర్రిపోతుల బుల్లిబాబు, కుల్లి రాజేష్‌కుమార్, షేక్ బాజి పాల్గొన్నారు.

సంకురాత్రిపాడులో ఇంటింటి ఆరోగ్య సర్వే



నాదెండ్ల: నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని సంకురాత్రిపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైంది. ఈ సర్వేలో ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రూతమ్మ, ఆశ వర్కర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని పలు కాలనీల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, వైసీపీ నాయకులు జెట్టి బొల్లయ్య, పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. శావల్యాపురం గ్రామ ఎంపీటీసీ సభ్యు లు దేవనబోయిన పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, సర్పంచ్ పాప సాని విజయలక్ష్మి సమావేశంలో మాట్లాడారు.ఈసమావేశంలో ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు,ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య,తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సర్పంచులు,ఎంపీటీలు అన్నీ శాఖలు అధికారులుపాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు 250 మంది హాజరు

నరసరావుపేటరూరల్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శంకర భారతిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలకు 250 మంది పాల్గొన్నట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయిని ఎం.పార్వతి శనివారం తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగంలో బాల, బాలికలు పాల్గొని ప్రతిభ కనపరిచి నియోజకవర్గస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

జగనన్నకే ప్రజల మద్దతు

- ప్రతిపక్షాలు ఒక్కటైనా భయపడం
- వైద్యారోగ్య శాఖమంత్రి విడదల రజిని
- గణపవరంలో గడప గడపకు కార్యక్రమం



లబ్ధిదారులకు పథకాల వివరాలను వెల్లడిస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ జతకలిసి వచ్చినా ప్రజల వైపు నిలబడిన వైఎస్సార్ సీపీకే అన్ని వర్గాల ప్రజల మద్దతు దక్కడం ఖాయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలోని 1వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం పదోరోజు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ కాలనీలో అన్ని వీధులు పర్యటించారు. స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే దుష్టబుద్ధితో ప్రతిపక్ష పార్టీలన్నీ దుష్టత్రయంగా కలిసి వస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి సువర్ణ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాలు అండదండగా ఉన్నాయన్నారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ రీతిలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో పింఛను రావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి ఉసూరుమన్న ఎందరో బాధితులకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తలుపుతట్టి వలంటీర్ల ద్వారా పింఛను అందిస్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఆండగా నిలిచిందన్నారు. మూడేళ్ల పాలనలో 5 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి యువతకు వెన్నుదన్నుగా నిలిచామన్నారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, అందరికీ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, చేతివృత్తులకు చేయూత వంటి విశిష్ట పథకాలతో ప్రతి గడపకు ప్రభుత్వ సాయం చేరుతుందన్నారు.

గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి 151 సీట్లు అందించిన ప్రజలు, ఈదఫా ఎన్నికల్లో ఫుల్ మెజార్టీ 175 సీట్లు వచ్చేలా దీవించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లెల రాజేశ్‌నాయుడు, కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, నాలుగో వార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, స్థానిక నాయకులు ప్రభుదాసు, పెనుమల భీమయ్య, గంగులు, అశోక్, మధుబాబు, పాటిబండ్ల వీరయ్య, రాయపాటి సింగారావు, వంగలపూడి శ్యామ్, రమణయ్య, లాజరు, నాయకులు రవిబాబు, సింగారెడ్డి కోటిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, చిన్న, గాలి బుచ్చయ్య, అనిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీలు

- పార్టీలో చేరిన 24వ వార్డుకు చెందిన 35 బీసీ కుటుంబాలు
- సీఎం జగన్ వల్లే పార్టీపై అభిమానం చూపిస్తున్న బీసీ వర్గీయులు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: బీసీ సామాజికవర్గానికి చెందిన 35కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరటం చాలా సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 24వ వార్డు ప్రశాంతినగర్‌కు చెందిన 35కుటుంబాల సభ్యులకు కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు, బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి ఆయా వర్గాలు పార్టీపట్ల ఆదరణ చూపిస్తున్నారన్నారు. ప్రశాంతినగర్‌లో ఎక్కువగా బీసీలు, ఎస్‌టీలు నివాసం ఉండే ప్రాంతమన్నారు. ఎన్నిపార్టీలు కలిసి వచ్చినా సీఎం జగన్ అమలుచేస్తున్న పథకాలతో లబ్ధిపొందుతున్న వారందరూ పార్టీపై అభిమానం చూపిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బొద్దుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముత్యాలపల్లి ఈశ్వర్, గంగధారి సురేష్, వెంకట్, ముత్యాలపల్లి వెంకన్న, అంజిబాబు, చింతాలు, టి.దుర్గా, లలిత, హిమబిందు, రమణ, గడిపూడి వెంకటేశ్వరరావు, పీర్‌వలి, మస్తాన్‌వలి, ఆదాం, భాస్కరరావు, వాసు తదితరులు పార్టీలోకి రావటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము సుబ్బారెడ్డి నాయకులు మారూరి శివారెడ్డి, కాకుమాను సదాశివరెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

పంపిణీకి మట్టి వినాయకులు



చిలకలూరిపేట: ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆధ్వర్యంలో పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండప కార్యదర్శి పొట్టి శ్రీరాములు తెలిపారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరూ పర్యావరణహితంగా పండుగ నిర్వహించుకునేందుకు గత 10 సంవత్సరాల నుంచి కల్యాణమండప కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేయటం జరుగుతున్నదని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి కల్యాణమండప ప్రాంగణంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహిస్తామన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

యడ్లపాడు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యులు కావాలని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఏఏ మధుకుమార్ తెలిపారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవంలో భాగంగా ఏపీకోస్ట్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కారుచోల గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో గొడుగులతో ప్రదర్శన చేశారు. అనంతరం పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఏవీ నారాయణ, రమేష్ ఆధ్వర్యంలో ఓజోన్ పొర పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన, వృక్తత్వ, చిత్రలేఖనం పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ టి సుగంధరావు, జగ్గాపురం జెడ్పీహైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఎస్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు సాంబశివరావు, ఎస్ రవి కుమార్, నాగలక్ష్మి, సీహెచ్ రాజ్యలక్ష్మి, డీఎల్ఎన్ సుందరమ్మ, పి రమాదేవిబాయి, వి వెంకటరమణ, ఎల్ భాస్కరరావు పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లును అందజేశారు.

గిరిజన పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.కుమారి, సంస్థ వ్యవస్థాపకుడు కంచర్ల బుల్లిబాబు, స్టడీ మెటీరియల్ దాత రోజ్‌మేరీశ్యామ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ, విద్యార్థినులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా ఆరంభమైన క్రీడా పోటీలు



రొంపిచర్లలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం



రొంపిచర్లలో హై జంప్ చేస్తున్న విద్యార్థి

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి.. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.యం. సుభానీ, గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తుందన్నారు. మండల స్థాయిలో జరిగే ఈ పోటీల్లో బాగా ఆడాలన్నారు. అనంతరం విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, బాల్ బాడ్మింటన్, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్ వంటి క్రీడలను నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆడారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను మండల స్థాయి టీంగా ఎంపిక చేశారు. ఈ పోటీలలో మండలంలో అన్ని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వై. సైదయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సిహెచ్ కోటేశ్వరరావు, మండలంలో అన్ని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

చిలకలూరిపేట: క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, 17 క్రీడా సెలక్షన్స్ పోటీలు శనివారం ఏఎంజీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. పోటీలను క్రీడా జ్యోతి వెలిగించి మున్సిపల్ చైర్మన్ రఫాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలల స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు ఈ సెలక్షన్స్ పోటీలలో పాల్గొనేందుకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఏఎంజీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఎంఈవో కె లక్ష్మి, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో క్రీడాజ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

స్కూల్‌గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక

నాదెండ్ల: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్ పోటీలు శనివారం చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా క్రీడా పోటీలను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ కేవీ నాగరాజు, నియోజకవర్గ కోఆర్డినేటర్ షేక అచ్చేమియా, పల్నాడు జిల్లా ఏపీపీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాదర్‌మస్తాన్ హాజరయ్యారు. ఈ పోటీల్లో ఖోఖో, వాలీబాల్, టెన్నీ కాయిట్, కబడ్డీతో పాటూ అథ్లెటిక్స్ నిర్వహించారు. 14, 17 ఏళ్లలోపు బాలబాలికలకు విడివిడిగా పోటీలు జరిగాయి. నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.



చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు



చిరుమామిళ్ల జెడ్పీ హైస్కూలులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రజకులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: రజకులను అవమాన పరుస్తూ మాట్లాడిన మహిళను అరెస్టు చేయాలని, ఆ విజువల్స్‌ను సెన్సార్ విధించకుండా ప్రత్యక్షంగా చూపించిన ఏబీఎన్ చానల్‌పై చర్యలు తీసుకోవాలని రజక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రజక సంఘ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, పలువురు రజక ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో నారా చంద్ర బాబునాయుడు అరెస్టును ఖండిస్తూ బెంగుళూరు నుంచి ఓ మహిళ రజకులను తూలనాడుతూ మాట్లాడిందన్నారు. అయితే ఆ మాటలను యధావిధిగా ఏబీఎన్ ఛానల్ ప్రసారం చేయటంతో పలు రాష్ట్రాల్లోని రజకుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఒక కులాన్ని తిట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సి ఉందన్నారు. ఆ మహిళను తక్షణమే అరెస్టు చేసి ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. మోటుపల్లి అంజి, బండి సుబ్బారావు, రాము, పార్వతి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడిచ్చిన వరం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు
- వేల్పూరులో అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

శావల్యాపురం: జన్మభూమి రుణం తీర్చుకోవటం దేవుడిచ్చిన వరమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అన్నారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో రూ. ఒక కోటి 80 లక్షల వ్యయంతో నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమంతో గడప-గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, మండల గ్రాంటు రూ. 5 లక్షలతో ప్రయాణికుల విశ్రాంతి భవనం ప్రారంభోత్సవం కార్యక్రమాలు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, ప్రజా ప్రతినిధులు వెలమవారిపాలెం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఇర్లపాడు వరకు పొలాలకు వెళ్లే నూతన రహదారి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పల్నాటి బ్రహ్మనాయుడు, తాండ్రపాపరాయుడు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా వేల్పూరు గ్రామంలోని కళామందిరం సెంటరులో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో అభివృద్ధి కేవలం శిలఫలకాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. కోట్లు దోచుకున్న టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడిను జైల్లో పెడితే నేడు స్పందించే నాయకులు లేకపోవటం వారి పరిపాలనకు నిదర్శమన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నుడు లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. వేల్పూరు గ్రామంలో రూ. 4 కోట్లు వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషను, రూ. 6కోట్లు వ్యవంతో శీతల గిడ్డంగి కేంద్రం, తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బురిడిబాబు జీవీ ఆంజనేయులు అక్రమంగా కోట్లు విలువ చేసే భూములను దోచుకోవటం కాకుండా వారి అనుచరులైన పెమ్మసాని నాగేశ్వరరావు, రావర్ల జగ్గారావు, తన బావమరిది పేర్లపై దొంగ సర్వే నంబర్లు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించటం దుర్మార్గమన్నారు. తనపై ఇష్టానుసారంగా నిందలు వేయటమే కాకుండా తరుచూ సోషల్ మీడియాలో 175 ఎకరాలు భూమిని అక్రమించుకున్నారని ప్రచారం చేయటం కాదని, ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. శివశక్తి లీలా అంజన్ పౌండేషన్ ద్వారా అవ్వ-తాతాలకు కంటి ఆపరేషన్లు చేయిస్తున్నామని ప్రవాసభారతీయులు దగ్గర కోట్లు నగదును విరాళాలు రూపంతో దోచుకున్న ఘనత ఆంజనేయులకే దక్కుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేసిన భూకబ్జాలపై విచారణ చేయిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, ఉపసర్పంచ్ రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి కబ్బారావు, ముంద్రు రాఘవరావు, ఉజ్జినేని కాంతారావు, ఎంపీటీసీ లింగా పున్నమ్మ, ముంద్రు సాంబశివరావు, గట్టుపల్లి వీరాస్వామి, కుమ్మరి గుంట్ల ఏడుకొండలు, ఆలపాటి సాంబశివరావు, పెద్దన్న,నాగినేని ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకటరావు, బీర్నేడి రత్నగిరి, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రాచవేల్పూల కుమార్ రాజా, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పి.సీ తారామయ్య, ఎంఈవో పుసులూరి లలితాకుమారి, వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ భూములకు పరిహారం చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కుల్ని పంపిణీ చేస్తున్న ట్రాన్స్‌కో ఏఈ అవినాష్

యడ్లపాడు: సుదీర్ఘకాల పోరాటం తర్వాత ట్రాన్స్‌కో విభాగం రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని చెల్లించింది. వివరాలల్లోకి వెళితే..2017వ సంవత్సరంలో సత్తెనపల్లి 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్తిపాడు 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 35 కిమీ మేర ప్రత్యేక విద్యుత్ లైన్‌ను ట్రాన్స్‌కో ఏర్పాటు చేసింది. గ్రామాలతో పాటు యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం పరిధిలోని 42 మంది రైతుల పొలాలు గుండా వెళ్లాయి. పనులకు ముందే కారిడార్ భూములకు పరిహారం చెల్లించాల్సి ఉన్నా, గత ప్రభుత్వం అలసత్వంతో నేటికీ ఆయా గ్రామాల రైతులకు పరిహారాన్ని ఇవ్వలేదు. దీంతో పరిహారం కోసం లింగారావుపాలెం రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసు తుది విచారణకు రాకముందే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించారు. ఈనేపథ్యంలో శనివారం లింగారావుపాలెం గ్రామంలో బాధిత రైతులకు కారిడార్ భూముల పరిహారం చెక్కుల్ని అందజేశారు. ఎకరాకు ఆప్రాంతంలో ఉన్న భూమి రిజిస్ట్రేషన్ విలువలో 10 శాతం నష్టపరిహారం చొప్పున చెల్లించారు. కారిడారు కింద 18 ఎకరాలు కోల్పోగా ఒక్కో ఎకరాకు రూ.1,15,000 చొప్పున 46 మంది రైతులకు రూ.20.70 లక్షల పరిహారం చెక్కుల్ని ట్రాన్స్‌కో అవినాష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ఏ ప్రాజెక్టు కింద రైతుల భూమి పోయినా ముందుగానే బాధితులకు పరిహారం చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోనందునే రైతులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కాబట్టే రైతుసంఘం ఆధ్వర్యంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. మిగిలిన గ్రామాల రైతులకు కూడా ఇదే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గోగడ హరిబాబు, ఆలోకం సుబ్బారావు, నంబూరి శివరామకృష్ణ, తోకల కోటేశ్వరరావు, జరుగుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

బీఎల్‌వోలతో నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతబాబు



బీఎల్ఓలతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఆర్‌వో వసంతబాబు

యడ్లపాడు: ఓటర్ల జాబితా పెండింగ్ పనులు పూర్తి చేయాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి వసంతబాబు చెప్పారు. యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబిత రూపకల్పనపై బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోలతో ఆయన మాట్లాడుతూ జాబి తా సవరణలో తప్పొప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఫారం -6 ఇచ్చిన కొత్త ఓటర్లు గుర్తించి చేర్చడం, అలాగే ఫారం -7 ద్వారా మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు.

ముఖ్యంగా ఫారం -8 తాలూకు పేర్లు, అడ్రస్, డోర్‌నంబర్లు ఇతరేత్ర మార్పులు, చేర్పుల్ని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. జాబితా పూర్తి పెండింగ్ వ్యవహారాన్ని ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, సీనియర్ సహాయకులు మోజేష్, రెవెన్యూ సిబ్బంది, 57 మంది బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



మున్సిపల్ కమిషనర్ గోవిందరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ కోరారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చెత్త ఎత్తటానికి ఉపయోగించే పుష్‌కార్ట్ బండ్లు గత కొంతకాలంగా మరమ్మత్తులకు గురి కావడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కార్మికులకు ఫైర్ స్టేషన్, గాంధీ పార్కు వద్ద హాజరు పాయింట్లు ఏర్పాటు చేసి హాజరు తీసుకొనేవారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఆయా వార్డు సచివాలయాల వద్ద హాజరు తీసుకుంటున్నారని ఇది కార్మికులకు ఇబ్బందిగా ఉన్నందున సానుకూలంగా స్పందించాలని కోరారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే కొత్త పుష్‌కార్ట్ బండ్లు కొనుగోలు చేస్తామని చెప్పారు.